www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 6 జనవరి 2023

5

చిత్తూరు



స్వచ్ఛ సర్వేక్షన్లో తిరుపతికి జాతీయ అవార్డు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్‌కి స్వచ్ఛ సర్వేక్షన్ 2023 లో భాగంగా జాతీయస్థాయిలో అవార్డ్ దక్కిందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేది డిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డ్ అందుకుంటామన్నారు. ఈ అవార్డ్ రావడానికి ముఖ్యంగా తిరుపతి నగర ప్రజల సహకారం ఎంతో ఉపయోగ పడిందని, మరోవైపు మునిసిపల్ కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది పని తీరు వలన, ఇంకో వైపు కౌన్సిల్ సహకారం వలన, అదేవిధంగా నగరపాలక సంస్థ సిబ్బంది, అధికారుల సహకారంతో ముందుకు వెళ్లడం జరిగిందని, వీరందరికి ప్రత్యేక అభినందనలని కమిషనర్ హరిత తెలిపారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఐలు జిల్లా నాయకులు చల్లా వెంకటయ్య


'మనువాదుల' చేతిలో 'దేశం'

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, మనువాదుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మతోన్మాద బిజెపిని ఓడించి దేశాన్ని కాపాడుకోవాలని వక్తలు ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం యశోద నగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో 'మతోన్మాద బిజెపిని ఓడిద్దాం.. దేశాన్ని కాపాడుకుందాం' అనే అంశం మీద నగరంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 'ఐలు' జిల్లా నాయకులు చల్లా వెంకటయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు రాఘవ శర్మ, భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పి అంజయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, పది సంవత్సరాలుగా చాలా తీవ్రమైన ప్రమాదాన్ని ప్రజలు ఎదుర్కొంటున్నారనీ, భావ ప్రకటన స్వేచ్ఛను తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

అందులో భాగంగానే పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రమాదం ఉప్పెనలా వస్తుందని,ఇటీవల జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే భయం వేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. బిజెపి మతం పేరుతోనూ, దేవుడి పేరుతోనూ, తాము చెప్పిందే శాసనం అన్నట్లుగా వ్యవహరిస్తోందన్నారు. నరేంద్రమోడీ గుజరాత్ సిఎంగా ఉన్నపుడు రెండువేల మంది ముస్లీంలను ఊచకోత కోశాడని, ప్రధాని అయ్యాక కార్మిక, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నాడని మండిపడ్డారు. ఒలంపిక్స్‌లోనూ మతోన్మాదం కాలు పెట్టడం వల్ల రెజ్లర్లు సైతం తమకు ఈ మెడల్స్ వద్దంటూ గంగలో వేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చిన్నం పెంచలయ్య, బిఆర్ఎస్ నాయకులు ఆర్కాట్‌కృష్ణప్రసాద్, ఆమ్‌ఆద్మీ పార్టీ బెల్లంకొండ సురేష్, విసికె నాయకులు రమేష్, రచయిత గొడుగు చింతల గోవిందయ్య, డిఎంసి భాస్కర్ పాల్గొన్నారు.



'బై' జూస్.. 'వై' యూజ్.!

- 'బజాజ్'తో కలిసి కోట్లల్లో బురిడీ
- లాప్‌టాప్, ట్యాబ్‌లంటూ మోసం
- తిరుపతిలోనే వెయ్యిమంది బాధితులు

ప్రజాశక్తి - తిరుపతి

" ప్రస్తుతం ప్రైవేటు యూజర్లకు రూ. 20 వేల నుంచి 25 వేలు చెల్లిస్తే అందిస్తున్న బైజూస్ కంటెంట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నాం. తద్వారా ప్రైవేటు బడుల్లో చదువుతున్న పిల్లలతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎదుగుతారని, ఈ సంస్థ తో ఒప్పందం ఒక గేమ్ చేంజర్" అని రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపిస్తున్న " బైజూస్ " సంస్థ నిర్వాహకుడు రవీంద్ర తీరు తీవ్ర దుమారం లేపుతోంది. పేద, మధ్యతరగతి విద్యార్థులే టార్గెట్ గా తిరుపతి , పరిసర ప్రాంతాల విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి... ' మీ పిల్లలు ఉన్నత స్థానానికి ఎదగాలంటే ఉత్తమమైన విద్యను అందించాలి. అందుకే అత్యుత్తమ, జాతీయ స్థాయి లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో అత్యాధునిక పద్ధతిలో లైవ్ క్లాసులను నిర్వహిస్తున్నాం. మీ పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు, కలెక్టర్లు, ఉన్నత పోలీసు అధికారులు గానో ఎదగాలంటే మా ఈ బైజుస్ ద్వారా అందిస్తున్న కంటెంట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. పెద్ద పెద్ద కార్పొరేట్ విద్యాసంస్థల్లో చెబుతున్న తరహాలోనే అతి తక్కువ ధరలకే మీకు బైజుస్ కంటెంట్ ను అందిస్తున్నాం. మా కంటెంట్ ఒక్కసారి వింటే చాలు...పిల్లల మదిలో అతి సులభంగా పాఠాలు నిలిచిపోతాయి. లాప్టాప్ , టాబ్ మేమే ఏర్పాటు చేస్తాం . పైగా ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం కూడా మా కంటెంట్ ను కొని ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పిల్లలకు అందిస్తోంది అంటే మా నాణ్యత ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అందుకే మీరు ఒకసారి తిరుపతి లోని మా ఆఫీస్కు రండి' అంటూ ఆశపెడుతున్నారు. వచ్చాక...ఒక లక్ష నుంచి మొదలెట్టి 70 నుంచి 60 వేలకు విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పిస్తున్నారు. పైగా బజాజ్ ఫైనాన్స్ తో జతకట్టి ఫీజు చెల్లించేందుకు ఈఎంఐ సౌకర్యాలనూ వారే కల్పించడం గమనార్హం. వీటితో పాటు లాప్టాప్ , ట్యాబ్లను బలవంతంగా విద్యార్థులతో కొనిస్తున్నారు. ఇలా ఒక్క తిరుపతి నగరంలోనే 1000 మందికి పైగా వసూలు చేసినట్లు ప్రజాసంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఇలా ఇప్పటికే 70 కోట్లకు పైగా తిరుపతిలో వసూలు చేసినట్లు విద్యార్థి సంఘాల నేతల విమర్శలు.

ప్రీ రికార్డింగ్ వీడియోలతో బురిడీ

కంటెంట్ను లైవ్ లో ఇస్తామని హామీ ఇచ్చిన బైజుస్ నిర్వాహకులు తీరా ప్రీ రికార్డింగ్ వీడియోలను రోజుకు గంట నుంచి రెండు గంటల పాటు ఇస్తున్నారన్న విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఇదేంటని ప్రశ్నిస్తే వారిని నిర్వాహకులు బెదిరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఇదే విషయమై బైజుస్ యాజమాన్యాన్ని నిలదీసిన ఏడుమంది విద్యార్థిసంఘాల నాయకులపై తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసేందుకూ వెనకాడకపోవడం గమనార్హం.

రవీంద్రపై చర్యలు తీసుకోవాలి : పి మురళి ,సీపీఐ జిల్లా కార్యదర్శి

బైజుస్ కంటెంట్ పేరుతో పేద మధ్యతరగతి వర్గాల విద్యార్థులను మభ్యపెట్టి గోల్మాల్కు పాల్పడుతున్న బైజుస్ రవీంద్ర పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. తిరుపతి నగరం తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది రూపాయల స్కాంకు పాల్పడుతున్న బైజుస్ యాజమాన్యంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఎందుకు అంత ప్రేమో అర్థం కావడం లేదు. నాసిరకం ట్యాబ్లు, లాప్టాప్ లంటూ ఇప్పటికే వందల కోట్ల రూపాయలను ప్రభుత్వం దుర్వినియోగం చేసింది. ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతోంది.




బైజూస్ కంటే ఉపాధ్యాయులే ఎన్నో రెట్లు మేలు : అవనిగడ్డ పద్మజ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

బైజుస్ కంటే ఉపాధ్యాయులే ఎన్నో రెట్లు మేలు. ఈ విషయాన్ని ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించాలి. డిజిటల్ కంటెంట్ ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం తప్ప అందువల్ల ఉత్పన్నవుతున్న సమస్యల్ని పట్టించుకోవడం లేదు. కోట్లాది రూపాయల స్కాం కు పాల్పడుతున్న బైజ్యూస్ సంస్థ పై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, ఆ సంస్థను వెనకేసుకు రావడం లో ఆంతర్యం ఎంటో అనే అనుమానాలు అందరిలో వ్యక్తమవుతున్నాయి.



ద్వైవార్షిక లబ్ధి రూ.3.13 కోట్లు: కలెక్టర్



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎంపీ, కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: అర్హత ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి పొందని వారికి మరొక అవకాశం ఇస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వైవార్షిక లబ్ధి కింద సంక్షేమ పథకాల నగదును లబ్ధిదారులకు జమ చేస్తున్నారని చిత్తూరు ఎంపి ఎన్.రెడ్డెప్ప పేర్కొన్నారు. శుక్రవారం ద్వైవార్షిక నగదు లబ్ధి మంజూరు కార్యక్రమాన్ని సీఎం క్యాంప్ కార్యాలయం నుండి కంప్యూటర్ బటన్ నొక్కి వర్చువల్‌గా ప్రారంభించారు. జిల్లా సచివాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ ఎస్.షన్మోహన్, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, మేయర్ అముద, జెడ్పీ మహిళా స్థాయి సంఘ ఛైర్మన్ భారతి, తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ద్వైవార్షిక లబ్ధి క్రింద వైఎస్ఆర్ ఇ.బి.సి నేస్తం క్రింద 137 మందికి రూ.20.55లక్షలు, జగనన్న అమ్మఒడి కింద 1,343 మందికి రూ.1.90 కోట్లు, జగనన్న చేదోడు కింద 420మందికి రూ.42 లక్షలు, వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా కింద 54 మందికి రూ.44.95లక్షలు, వైఎస్ఆర్ కాపు నేస్తం కింద 18 మందికి రూ.2.70లక్షలు, వైఎస్ఆర్ నేతన్న నేస్తం కింద ఒకరికి రూ.24 వేలు, వైఎస్ఆర్ వాహన మిత్ర కింద 92 మందికి రూ.12.75 లక్షలు మొత్తం 2,065 మందికి రూ.3.13కోట్లు లబ్ధి చేకూరనుందని తెలిపారు. కార్యక్రమానికి డిఆర్డిఎ పిడి తులసి, బిసి, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు రబ్బానీ బాషా, రాజ్యలక్ష్మి, బిసి కార్పొరేషన్ ఈడి శ్రీదేవి, డిఈఓ విజయేంద్రరావ్, డిఎల్‌డిఓ రవికుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సురక్ష-2 సర్వే పక్కాగా చేయాలి: కమిషనర్

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష-2 సంబంధించి ఇంటింటి సర్వే పక్కాగా పూర్తి చేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ వార్డు ఆరోగ్య కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, జగనన్న ఆరోగ్య సురక్ష-2, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, ఆడుదాం ఆంధ్ర అంశాలపై వార్డు కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లను సమన్వయం చేసుకొని వందశాతం సర్వే పూర్తి చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో చాలా వెనకబడ్డామని, పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో వార్డు స్థాయిలో పనుల నిర్వహణ, చెత్త తొలగింపు అంశాలపై రాబోయే వారం రోజుల వరకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి సమర్పించాలన్నారు. ప్రధాన రోడ్లు, కూడళ్లు శుభ్రంగా ఉంచేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. "ఆడుదాం ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా నెక్స్ట్ లెవెల్ క్రీడలకు సంబంధించి టీములను సిద్ధం చేసి ఆన్లైన్ చేయాలన్నారు. ఇప్పటివరకు జరిగిన క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారితో టీం సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, సీఎంఎం గోపి, సానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం, సీవోలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో సంపూర్ణ వైద్యం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్షతో ఖర్చు లేకుండా సంపూర్ణ వైద్యం పొందవచ్చని డిఎంహెచ్‌వో ప్రభావతిదేవి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీసీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష-2 క్యాంపును ప్రతి కుటుంబానికి ఖర్చు లేకుండా సంపూర్ణ వైద్యం ప్రతి ఇంటికి ఉచితంగా అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యం అన్నారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు, 7రకాల పరీక్షలు, 92 రకాల మందుల పంపిణీ, స్పెషలిస్ట్ డాక్టర్ల వైద్య సేవలు, కంటి వైద్య సేవలు తప్పక నిర్వహించి ప్రజల ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని కమిషనర్ ఆదేశించారు. అత్యవసర కేసులను కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేయాలని, ఆరోగ్యశ్రీ ద్వారా 25 లక్షల రూపాయల వరకు ఉచితంగా చికిత్స చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజలు ప్రైవేటుగా కొనే మందులను కూడా అప్లోడ్ చేసి ఉచితంగా ఇంటి వద్దకు పోస్టు ద్వారా పంపబడుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ప్రతి అధికారి బాధ్యతతో నిర్వహించి విజయవంతం చేయాలని డిఎంహెచ్‌వో అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ సుదర్శన్, డాక్టర్ శిరీష, జార్జ్, వైద్య అధికారులు పాల్గొన్నారు.

బాలగణిత అవధానులకు జేవీవీ అభినందన

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

జనవిజ్ఞాన వేదిక, ఏపీ మ్యాథ్స్ ఫోరం జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతదేశంలో మొట్టమొదటిసారిగా 30మంది విద్యార్థులతో 13పాఠశాలల్లో గణిత అష్టావధాన కార్యక్రమాన్ని నిర్వహించిన బాల అవధానులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన స్పందన ఫౌండేషన్ శ్యామల దేవి మాట్లాడుతూ గణిత అవధాన గురువు హెచ్.అరుణ శివప్రసాద్ ఆధ్వర్యంలో చిత్తూరు పరిసర ప్రాంతాలలో ఒకేసారి 30మంది విద్యార్థులతో అవధానాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. విజయం విద్యాసంస్థల డైరెక్టర్ తేజోమూర్తి మాట్లాడుతూ గణితం ప్రాధాన్యత నేటి ఆర్థిక వ్యవస్థకు పునాది అని దేశ సంపదలో 70 శాతం ఆదాయం సాఫ్ట్వేర్ ద్వారా లభిస్తుందని దానికి గణితమే మూలమని తెలుపుతూ విద్యార్థుల్లో గణితంపై భయాన్ని పోగొట్టేందుకు అవధాన కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. లైన్స్‌క్లబ్ గోల్డ్ అధ్యక్షులు ఎం.వి.శ్రీధర్ మాట్లాడుతూ చిత్తూరు నగరంలో ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించేవారు తక్కువయ్యారని విద్యకు సంబంధించిన అవధానం, గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమాలను నగరవాసులు ప్రోత్సహించాలని కోరారు. అనంతరం అవధాన గురువు హెచ్.అరుణ శివప్రసాద్, బాలగణిత అవధానులను, ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన 13 పాఠశాలల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాపుదేశీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జయంతి జన విజ్ఞాన వేదిక పర్యావరణ విభాగం కన్వీనర్ సుధాకర్, మ్యాథ్స్ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమ నాయుడు, జెడ్ఎస్-ఎస్ కోఆర్డినేటర్ త్యాగరాజునాయుడు, గల్లా రంగనాథం, విజయ్‌కుమార్, బాలయ్య, సుధాకర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో కార్మికులు.. చెత్త ఊడ్చిన కమిషనర్



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: న్యాయపరమైన తమ డిమాండ్‌లు తీర్చాలంటూ మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టారు. దీంతో నగరంలో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయింది. వీధులన్నీ చెత్తా చెదారాలతో నిండిపోయాయి. శుక్రవారం నగర కమిషనర్ డాక్టర్ అరుణ నగరంలోని బజారు వీధి, డీఐ రోడ్డు, వన్నియర్ బ్లాక్ ప్రాంతాల్లోని వీధులను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న వీధులను స్వయంగా చీపురు పట్టి శుభ్రం చేశారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, కార్పొరేటర్ శశికుమార్, స్థానిక యువతతో కలిసి వన్నియర్ బ్లాక్ వీధులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో అందుబాటులో ఉన్న వారికి అదనంగా ప్రత్యామ్నాయ విధానాల ద్వారా దినసరి కార్మికులను ఉపయోగించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇదే సమయంలో డ్వాక్రా సంఘాల నుండి మహిళలు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటామన్నారు. నగరంలో పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా నగర ప్రజలు తమ వంతు సహకారం అందించాలన్నారు. కమిషనర్ పిలుపుతో స్పందించిన స్థానిక కార్పొరేటర్ శశికుమార్ తమ వార్డులో స్థానిక యువత ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు. వార్డు శుభ్రత కోసం తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం, వార్డు కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

క్రాంతి జ్యోతి..సావిత్రిబాయి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

'క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే మహిళలందరికీ ఆదర్శం' అని వక్తలు ఉద్ఘాటించారు. ఉపాధ్యాయరంగానికి ఆమె చేసిన సేవలు ఆదర్శప్రాయమన్నారు. జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తడ,దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండల శాఖల ఆధ్వర్యంలో యుటిఎఫ్ జిల్లా మహిళా కమిటీ కన్వీనర్ కే.ఎం.ఎస్ సునీల అధ్యక్షతన ప్రభుత్వ ఉన్నత పాఠశాల సూళ్లూరుపేట నందు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వచ్చిన వక్తలు అందరూ సావిత్రిబాయి పూలే భారతదేశం యొక్క మొదటి మహిళ ఉపాధ్యాయునిగా, ఎన్నో సామాజిక సేవలను చేసి, బాలికా విద్యను బలోపేతం చేసి, సమాజంలో మహిళల పట్ల వ్యవహరిస్తున్న మూఢ నమ్మకాలను అరికట్టి, ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అని ప్రపంచానికి చాటి చెప్పిందని కొనియాడారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తిరుపతి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అవనిగడ్డ పద్మజ ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. పాణ్యం ఉష మాధవిలత, భూసం విజయమ్మ, జి.ఝాన్సీబాయ్, కె.ధనలక్ష్మి, బందెల స్వర్ణలత,గన్నవరం సరస్వతిలను ఉత్తమ మహిళా ఉపాధ్యాయులుగా గుర్తించి సత్కరించారు. ఈ సమావేశంలో సూళ్లూరుపేట ఎంపిడిఓ మురళికృష్ణ, మండల విద్యాశాఖాధికారి కాపులూరు శ్రీనివాసులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జిజె రాజశేఖర్, పూర్వ రాష్ట్రకార్యదర్శి చెంగాని చంద్రశేఖర్, గౌరవాధ్యక్షులు కె.శేఖర్, జిల్లా కార్యదర్శి కావూరు ప్రభాకర్, కమిటీ కన్వీనర్ ఎస్.బాబు పాల్గొన్నారు.



యుటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు ఘన సన్మానం

హామీలపై గళమెత్తి.. సర్కార్‌పై ధ్వజమెత్తి



కార్వేటినగరంలో అంగన్వాడీలకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు



పలమనేరులో



బైరెడ్డిపల్లిలో

- 25వ రోజూ కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె
- నినాదాలతో మార్మోగుతున్న దీక్షా శిబిరాలు
- చిత్తూరు సీడీపీవో కార్యాలయం ఎదుట రిలే దీక్ష
- కార్వేటినగరం శిబిరంలో మద్దతుగా నిలిచిన సీఐటీయూ ఉపాధ్యక్షులు వాడ గంగరాజు



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె విరమించబోమంటూ అంగన్వాడీలు ఖరాఖండిగా తేల్చిచెప్పారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాజెక్టు కేంద్రాల్లోని అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెలో పాల్గొన్నారు. 25రోజులుగా పట్టువిడవకుండా సమ్మెను కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సమ్మె శిబిరాల్లో ప్రభుత్వంపై నినాదాలు హోరెత్తుతున్నాయి. చిత్తూరు సీడీపీవో కార్యాలయం ఎదుట శుక్రవారం రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ నాయకులు సృజని, శశికళ, బుజ్జిలు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. ప్రధాన డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇవ్వకుండా సమ్మెను విరమించే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వం యూనియన్ నేతలను చర్చలకు ఆహ్వానించి జీతాల పెంపు, గ్రాట్యూటీ అమలుపై హామీ ఇవ్వాలని కోరారు. అంగన్వాడీల పోరాటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మద్దతు తెలిపారు. కార్వేటినగరంలో శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోవడం ప్రభుత్వానికి సరైన పద్ధతి కాదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వం దిగి వచ్చి డిమాండ్‌లు పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలా కాకుండా ఆందోళనను విచ్ఛిన్నం చేయాలని చూస్తే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు.

బైరెడ్డిపల్లి: డిమాండ్‌లు పరిష్కరించాలని అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 25వ రోజుకు చేరుకుంది. బైరెడ్డిపల్లి మండల సెక్టార్ నందు మండల కేంద్రంలోని బైరెడ్డిపల్లి సచివాలయం వద్ద సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగ అంగన్వాడీలు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కారించాలని కోరారు.

మూడో రోజుకు చేరిన పారిశుధ్య కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఇచ్చిన మాట ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలంటూ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారంతో మూడో రోజుకు చేరుకుంది. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల జేఏసి పిలుపు మేరకు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో సమ్మె కొనసాగిస్తున్నారు. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరశిస్తూ పారిశుద్ధ్య కార్మికులు మోకాళ్ళపై నిలబడి నిరసన వ్యక్తం చేశా రు. ఇంజనీరింగ్ విభాగం ఔట్ సోర్సింగ్ ఉద్యో గులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫ్లెకార్డులు ప్రదర్శి ంచారు. వీరి పోరాటానికి ఎఐటియుసి నాయకులు రమాదేవి, దారి చంద్రలు మద్దతు ప్రకటించారు.

భోజనాలు అందించిన జీజేఎం ట్రస్ట్

తమన్యాయమైన కోరికలపై సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీజేఎం ట్రస్ట్ ప్రతినిధి గురజాల చెన్నకేశవనాయుడు సంఘీభావం ప్రకటించారు. పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని రాష్ట్ర ప్రభు త్వాన్ని కోరారు. విధులను బహిష్కరించి సమ్మె చే స్తున్న పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విభాగం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీజేఎం ట్రస్ట్ తరుపున భోజనాలు అందించారు. కార్యక్రమంలో హేమాద్రి నాయుడు, మధుసూదన్, సుధాకర్ నాయుడు, చం ద్ర, సుగుణ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



కార్మికులకు భోజనాలు అందిస్తున్న జీజేఎం ప్రతినిధి

డిమాండ్‌లు నెరవేర్చేవరకు సమ్మె ఆగదు: సీఐటీయూ, ఏఐటీయూసీ

ప్రజాశక్తి-పలమనేరు: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విభాగం కార్మికుల న్యాయపరమైన సమస్యలు ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. పలమనేరు మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విభాగం కార్మికులతో కలిసి సమ్మెలో పాల్గొన్నారు. కార్మికుల న్యాయపరమై డిమాండ్‌లు పరిష్కరించకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, గిరిధర్‌గుప్తా, ఓబుల్‌రాజు, రాష్ట్ర నాయకులు నరసింహులు, ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు ఎం.సుబ్రహ్మణ్యం, పట్టణ కార్యదర్శి మంజునాథ్ బాబు పాల్గొన్నారు. కార్మికుల ఆందోళన కుట్రలతో అనచివేయాలని చూస్తే ఊరుకొనేది లేదన్నారు. ప్రభుత్వం దిగొచ్చి డిమాండ్‌లు పరిష్కరించి కార్మికులను ఆదోకోవాలని వారు అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వెంకటేశు, రమేష్ బాబు, వాసు వెంకటరమణ, చిన్నారెడ్డి, గోపి, ఆనంద, సురేష్, అరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: బంగారుపాళ్యంకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు వాసుదేవ నాయకుడు శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. సత్యసాయి బాబా భజన మందిరం మండల కన్వీనర్‌గా వ్యవహరించిన ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. జిల్లా సాయిబాబా భజన మందిర కన్వీనర్ దేవరాజులు సంతాపం తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కడపనతం గ్రామంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి ఇంటింటి సర్వే చేపట్టి కుష్టు వ్యాధి గురించి శుక్రవారం అవగాహన కల్పించారు. శరీరంపై నొప్పి, నవ్వ లేని రాగి రంగు కలిగిన మచ్చలు ఉంటే వైద్యాధికారి దగ్గర చూపించుకోవాలని సూచించారు. స్థానిక పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: కార్పొరేషన్ 11వ వార్డు లక్ష్మాంబపురం హరిజనవాడలో అనారోగ్యంతో మతిచెందిన టీడీపీ కార్యకర్త సురేష్ మృతి చెందారు. శుక్రవారం సురేష్ మృతదేహానికి నివాళులు అర్పించిన జీజెఎం ట్రస్ట్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవనాయుడు ఆయన కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

రైతు విభాగం అధ్యక్షులుగా శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి-రామకుప్పం: కుప్పం నియోజకవర్గ వైసిపి రైతు విభాగ అధ్యక్షులుగా మండల పరిధిలోని బందార్లపల్లి పంచాయతీ, బగళనత్తం గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డికి జిల్లా వైసీపీ అధ్యక్షుడు భరత్ నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రైతు బాధ్యతలు అప్పగించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డికి, ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు.

మైనార్టీ అధ్యక్షులుగా సయ్యద్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: వైసీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షులుగా 31వ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ నియమితులయ్యారు. సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డికి సయ్యద్ కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఖాజీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకారమంలో సన్మానించిన ఖాజీ సాహిబ్, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ గఫార్ ఖాన్‌కో ఆప్షన్ సభ్యుడు షుకూర్, అంజుమన్ కమిటీ అబ్దుల్ పలువురు ముస్లీమ్ నేతలు సయ్యద్‌ను సన్మానించారు.

వైభవంగా యోగానంద జయంతి

ప్రజాశక్తి-శాంతిపురం: స్థానిక పరమహంస యోగానంద విద్యాలయంలో పరమహంస యోగానంద 130వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉదయం నుంచి భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యాలయ జాయింట్ కరస్పాండెంట్ రాధాకృష్ణన్, విద్యాలయ ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ పరమహంస యోగానంద జీవిత విశేషాలను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో గురుజీ భక్తుల బృందంలోని సభ్యులైన చక్రపాణి రెడ్డి, నారాయణ శెట్టి, గణపతి శాస్త్రి, మణి , విద్యాలయ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఎంతో భక్తి శ్రద్ధలతో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. కార్యక్రమంలో శెట్టిపల్లి ఆదర్శ పాఠశాల(విక్టరీ బోర్డింగ్ స్కూల్)లో విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఓటుపై అవగాహన కలిగి ఉండాలి: డీటీ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఓటుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తాసిల్దార్ ఇబ్రహీం అన్నారు. మండలంలోని ముంగరమడుగు పంచాయతీలో ఈవీఎంలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికలకు ఓటును నమోదు చేసేందుకు ఈవీఎంలు సిద్ధంగా ఉన్నాయని వీటిని ఉపయోగించే విధానాన్ని తెలిపేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఈవీఎంలపైన అపోహలు వీడ వాటి పనితనాన్ని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అనిత, బిఎల్‌వోలు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతో 'గాలికుంటు' నయం

ప్రజాశక్తి-సోమల: టీకాలతో గాలికుంటు వ్యాధిని నివారించవచ్చని పశువైద్యాధికారి చందనప్రియ అన్నారు. శుక్రవారం మండలంలోని బసవపల్లి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారిని చందన ప్రియ మాట్లాడుతూ గాలి కుంటు వ్యాధి సోకిన పశువులకు పాల దిగుబడి తగ్గుతుందని జీవిత కాలం పాటు వ్యాధి పశువులకు ఇబ్బందికరంగా మారుతుందన్నారు. వెంట్రుకలు నిక్కబడుచుకుని ఉంటాయని ఈ నివారణ కోసం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయడం జరుగుతుందన్నారు. వీటిని మండలంలోని అన్ని పశువుల యజమానులు తమ పశువులకు తప్పక వేయించాలన్నారు. అపోహలు విడనాడాలని కోరారు.

'గ్రామ స్థాయిలోనే కార్పొరేట్ వైద్యం'

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సెట్టేరి పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రాథమిక వైద్యులు లోహిత్ చెంగల్ రాయల ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో కోఆప్షన్ నెంబర్ ఫిరోజ్ అహమ్మద్ సర్పంచ్ మహేంద్ర రెడ్డి, నాయకులు పాలాక్షి రెడ్డి, హేమచంద్ర, ఇంచార్జ్ ఎంపిడిఓ హరిప్రసాద్, వైద్యులు శిరీష, శాలిని తదితరులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని నంజంపేట ప్రాథమిక పాఠశాల ఆవరణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 302 మంది వైద్య పరీక్షలు నిర్వహించుకోగా పలువురికి మెరుగైన వైద్యం కోసం ఇతర హాస్పిటలకు రెఫర్ చేసినట్టు వైద్యులు తెలిపారు. జెడ్పిటిసి అమాస కుసుమమోహన్, ఎంపీడీవో నాగరాజు, వైద్యాధికారులు సోమశేఖరరెడ్డి, భార్గవి, ప్రదీప్‌కుమార్ రెడ్డి, నరసింహులు, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

మామిడి యాజమాన్యంలో శాస్త్రవేత్తల సూచనలు అవసరం

- జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి-సోమల: మామిడి రైతులు శాస్త్ర వేత్తల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సోమల స్త్రీశక్తి భవనంలో సోమల, చౌడేపల్లి మండలాలకు చెందిన మామిడి రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. మామిడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు విపులంగా వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి సంతోషి కుమారి, సిబ్బంది ఆలియా, మంజునాథ్, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలతోనే సర్దార్ బాషా మృతి

- టీడీపీ మైనార్టీ నేతల ఆరోపణ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: శాంతిపురం మండలం సోగడబల్ల గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ మైనారిటీ నేత సర్దార్ బాషా మృతి ఎంతగానో కలచివేసిందని రాష్ట్ర ముస్లిం మైనారిటీ నాయకులు పార్లమెంట్ నాయకులు చిత్తూరు నియోజకవర్గ నాయకులు మైనారిటీ నగర నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం టిడిపి సీనియర్ మైనారిటీ నేత సర్దార్ బాషా ఫింఛన్ తీసేసారని ఆవేదనతో మృతి చెందిన విషయం తెలుసుకొని నివాళులర్పించారు. సర్దార్ బాషా మృతికి స్థానిక వైసిపి నాయకులే కారణమని ఆరోపించారు. అనారోగ్యంతో బాధపడుతున్న సర్దార్ బాషా ఇంట్లో ఉండి విశ్రాంతి తీసుకుంటున్నారు. చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గమ్మ ఇటీవల చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సర్దార్ బాషా ఇంటికి వచ్చారన్నారు. సర్దార్ బాషా కుటుంబీకులు ఎమ్మెల్సీ భరత్ సతీమణి ఇచ్చిన చీరను తిరస్కరించారని, సర్దార్ బాషా ఫించన్ ఆపేయడం దారుణమన్నారు. గ్రామంలో ఫించన్ అందరికీ అలాగే ఉంచి సర్దార్ బాషా ఫించన్ వాలంటరీ గాయత్రి ఆపేసిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి మైనార్టీ నాయకులు నౌషాద్, జాఫర్, అక్తర్, నవాజ్ బాషా, గౌస్‌హకీమ్, అన్సర్, గౌస్ బాషా, జిలానీ, సిరాజ్ , మహబూబ్ బాషా, సర్దార్, మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీసేందుకే క్రీడాపోటీలు : ఎంపీపీ



క్రీడా సామగ్రిని అందిస్తున్న ఎంపీపీ

ప్రజాశక్తి-కార్వేటినగరం: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసి ఉన్నత స్థాయి అవకాశాలు కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వ 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎంపీపీ లతబాలాజీ అన్నారు. సచివాలయ స్థాయి నుంచి మండల స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులకు ఎంపీడీవో ఆధ్వర్యంలో క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ, ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, మణి, సిబ్బంది పాల్గొన్నారు.

'నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా..'

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానని జిడి నెల్లూరు టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ థామస్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని వీరకనెల్లూరు పంచాయతీలో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి మ్యానిఫెస్టోను వివరించి కరపత్రాలను అందజేశారు. గ్రామంలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అదే గ్రామానికి చెందిన వైస్ సర్పంచ్ నరేష్‌తో పాటు పలువురు యువకులు వైసిపి నుంచి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంటు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: వైసీపీ ప్రభుత్వం పేదలను మరింత నిరుపేదలుగా మారుస్తున్నదని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ మురళీమోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని బొమ్మాయిపల్లి పంచాయతీలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి మహిళా కార్యదర్శి రాధిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మండల టిడిపి అధ్యక్షులు ప్రకాష్ నాయుడు, ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్, నాయకులు వంశీ చౌదరి, రవీంద్ర నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు: వైసీపీ నేతలు చెప్పే మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మేలుముదొడ్డి, సింగిరి గుంట పంచాయతీలలో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాధవరెడ్డి, వెంకటస్వామి, మోహన్ నాయుడు, రఘుపతి నాయుడు, అంజిరెడ్డి తాత, సివిరెడ్డి, పోలీస్ గిరి, ఆసురి బాలాజీ, రామయ్య, జనసేన నాయకులు సివి గంగాధర్, పగడాల రమణ పాల్గొన్నారు.

మరోసారి పేదల ప్రభుత్వానికి అవకాశం ఇవ్వండి: అలీ

ప్రజాశక్తి-వెంకటగిరి: మరోసారి పేదల ప్రభుత్వానికి అవకాశం కల్పించాలని సీనినటుడు అలీ కోరారు. శుక్రవారం వెంకటగిరి ని యోజకవర్గంలో వైసిపి నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈబస్సు యాత్ర వెంకటగిరి నేదురుమల్లి నివాసం నుండి ర్యాలీగా వెంకటగిరిలోని కాశీపేట, పాలకేంద్రం మీదుగా డక్కిలి మీదుగా రాపూరుకు చేరుకుంది. డక్కిలిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత ఒక్క జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎక్కడా అమలు సంక్షేమ పథకాలను ఆంధ్రప్రదేశ్ అమలు చేసి చూపించిన పార్టీ వైసిపి యేనని కొనియాడారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈప్రాంత ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి అవకాశం కల్పించాలన్నారు. ఈ బస్సు యాత్రలో వెంటగిరి నియోజకవర్గ సమన్వకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి, సూళ్లురుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వెంకటగిరి రాజ కుటుంబీకులు సర్వజ్ఞకుమార యాచేంద్ర పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ వైస్ ఛాన్సలర్‌కి 'సౌత్ జోన్ వైస్ ఛాన్సలర్స్ కాన్ఫరెన్స్'కు ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఎపి స్టేట్ ట్రైబల్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న సౌత్ జోన్ వైస్ ఛాన్సలర్స్ కాన్ఫరెన్స్ కి లీడ్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించడానికి మహిళా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య భారతికి ఆహ్వానం అందింది. ఈ కాన్ఫరెన్స్ తంజా వూరులోని సస్త్ర యూనివర్సిటీ వేదికగా నిలిచింది. ఈ కాన్ఫరెన్స్ ముఖ్య ఉద్దేశం న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 2020 అమలు, పది విధాలైన వివిధ అంశాలపై అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చాగోష్ఠి నిర్వహించారు. మహిళా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య భారతి పాలనా, స్వయం ప్రతిపత్తి అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూజీసీ ఛైర్మన్ ఆచార్య ఎం జగదీశ్ కుమార్, నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఛైర్మన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి: ఎంపిడివో

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మధ్యాహ్న భోజనం రుచిగా, నాణ్యతగా పెట్టాలని ఎంపీడీవో సాయి లహరి పేర్కొన్నారు. మండలంలోని వెస్ట్ వరవత్తూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో, ఎంఈవో రవీంద్రనాథ్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజనం రుచిగా పెట్టటడానికి నిధులు పెంచిందని, వంట నిర్వహకులు రుచిగా వండిపెట్టాలన్నారు. విద్యార్థులకు భోజనాలు సక్రమంగా పెట్టకపోతే వంట నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శవ రాజకీయాలు మానుకోండి

- టీడీపీ నేతల విమర్శలను ఖండించిన వైసీపీ నేతలు

ప్రజాశక్తి-శాంతిపురం: టీడీపీ నేతలు శవ రాజకీయాలు మానుకొని నిర్మాణాత్మకమైన రాజకీయం చేయాలని మండల వైసీపీ నేతలు టిడిపి నాయకులకు సూచించారు. శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపిపి కె.వసుంధర కోదండరెడ్డి మాట్లాడుతూ శాంతిపురం మండల పరిధిలోని సోగడబళ్ళ గ్రామానికి చెందిన టి.సర్దార్ బాషా గుండెపోటుతో శుక్రవారం మరణించారని గతంలో కూడా ఆయనకు రెండుసార్లు గుండెపోటు వచ్చిన విషయాన్ని టీడీపీ నేతలు ధృవీకరించుకొని విమర్శలు చేయాలని సూచించారు. శవ రాజకీయాలు మానుకోవాలని ఎంపీపీ వసుంధర కోదండరెడ్డి టిడిపి నేతలకు హితవు పలికారు. జిల్లా వైసీపీ ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గా చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గతంలో సోగడబళ్ళ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడైన టి.సర్దార్ బాషా కుటుంబ సభ్యులు తమకు చీర వద్దని సున్నితంగా తిరస్కరించడంతో ఎమ్మెల్సీ సతీమణి వెనుతిరిగారని ఎంపీపీ అన్నారు. అదే గ్రామంలో మరో ముగ్గురు టీడీపీ సానుభూతిపరులకు కూడా చీరలు పంపిణీ చేయడానికి ప్రయత్నిస్తే తిరస్కరించారని ఆ విషయాన్ని టీడీపీ నేతలు గుర్తించాలన్నారు. అనవసరమైన రాద్ధాంతం చేస్తూ టీడీసీ ఉనికి కోల్పోతున్న తరుణంలో ఇలాంటి నీచమైన రాజకీయాలకు ఒడిగట్టడ ఆ పార్టీ నేతలకు తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, రామచంద్ర, మురుగేష్, శ్రీరాములు, సర్పంచ్ పద్మావతిభాస్కర్, ఎంపీటీసీ ఈశ్వరమ్మ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని చిందేపల్లి గ్రామపంచాయతీలో కొద్దిరోజుల క్రితం అనేక కారణాల వల్ల మరణించిన మృతుల కుటుంబాలకు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్ష రెడ్డి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున అందించారు. ఈ కార్యక్ర మంలోచిందేపల్లి సర్పంచ్ చెన్నూరు పెంచలయ్య, వైసిపి నాయకులు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

'బీస్' డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లా బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి(బీస్) డైరీ ఆవిష్కరణ శుక్రవారం రాత్రి తిరుపతిలోని యూత్ హాస్టల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీస్ కార్యవర్గ అధ్యక్షులు నీలం నరేంద్రనాథ్, కార్యదర్శి తోకల అశోక్ కుమార్, నెల్లూరు బీచ్ ఫౌండర్ పి. అనిల్ కుమార్ మాట్లాడుతూ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పరస్పర సహకారమే బీస్ ధ్యేయమని తెలిపారు. బీస్ అభ్యున్నతికి బలిజ ఉద్యోగులు తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీస్ ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, రవి కుమార్, అమర్ బాబు, లక్ష్మీ ప్రసాద్, ప్రసాద్, చంద్రశేఖర్, శ్రీలక్ష్మి, సత్యనారాయణ, ముని శంకరయ్య, బాలాజీ, మధుసూధన్, జయ ప్రకాష్, శివ కుమార్, మురళి, వర ప్రసాద్, మోహన్, సురేష్, నర్సింహులు, శ్రీనివాసులు, భాస్కర్, ప్రకాష్, కిషోర్, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న బలిజ ఉద్యోగులు పాల్గొన్నారు.

బొజ్జల సుధీర్ రెడ్డి ఆరోపణలు సిగ్గుచేటు: వైసిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : యానాదులకు ఉండడానికి గూడు నిర్మించాలని చూస్తే ఎమ్మెల్యేపై బొజ్జల సుధీర్ రెడ్డి కబ్జా ఆరోపణలు చేయడం సిగ్గుచేటని వైసీపీ నేతలు విమర్శించారు. అది కూడా చెంచులక్ష్మి కాలనీలో కబ్జాలకు పాల్పడ్డ ఓ దళిత నాయకుని వెంటబెట్టుకుని సుధీర్ రెడ్డి నానా యాగి చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. స్థానిక చెంచులక్ష్మి కాలనీ వద్ద శుక్రవారం వైసీపీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. 12 సంవత్సరాలుగా తాము బాడుగ ఇళ్లల్లోనే మగ్గుతున్నామనీ, ఓ దళిత నాయకుడు చెంచులక్ష్మి కాలనీలో ఆక్రమణకు దిగుతున్నాడని ఆ కాలనీ మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొస్తే, వారికి అక్కడ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశించారని నాయకులు తెలిపారు. ఈ క్రమంలో ఆ స్థలాన్ని యానాదులు చదును చేస్తే ఓర్వలేని బొజ్జల సుధీర్ రెడ్డి ఎమ్మెల్యే పై, ఆయన అనుచరులపై కబ్జా చేస్తున్నారంటూ ఆరోపణలు చేయడం వింతగా ఉందని చెప్పారు. ఎమ్మెల్యే పై కబ్జా ఆరోపణ చేసిన సుధీర్ రెడ్డి పై యానాదులే తిరగబడి తగిన సమాధానం చెప్పారని వివరించారు. ఇప్పటికైనా బొజ్జల సుధీర్ రెడ్డి చౌకబారు రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. వైసీపీ నేతలు గోరా పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

సెక్టార్ అధికారులకు ఆర్‌వో ఆదేశం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సెక్టారు అధికారులు అప్రమత్తంగా వుండాలని ఆర్‌వో కోదండరాం ఆదేశించారు. గూడూరు, వెంకటగిరి, సుళ్లూరు పేట నియోజకవర్గ ఎన్నికల్లో విధులు నిర్వహిం చనున్న సెక్టార్ ఆఫీసర్లకు వారి విధులపై గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం ట్రైనింగ్ ప్రోగ్రాం రిట ర్నింగ్ ఆఫీసర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ ఆఫీసర్ కోదండరాం మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో సెక్టార్ ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలని ఒక్కొక్క ఆఫీసరికి 10 నుండి 12 పోలింగ్ కేంద్రాలు ఇస్తామన్నారు. ఎన్నికల్లో పాటించాల్సిన నియమ నిబంధనల గురించి ట్రైనింగ్ ప్రోగ్రాం లో తెలుపుతామని వీటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్వోలు శ్రీనివాసులు, చంద్ర, ముని, తహశీల్దార్లు, సెక్టార్ ఆఫీసర్లు పా ల్గొన్నారు.

న్యాయ శాస్త్రంలో మంజువాణికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం న్యాయ శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థిని వి మంజువాణి కి డాక్టరేట్ ప్రదానం చేశారు. న్యాయశాస్త్ర విభాగపు ఆచా ర్యులు ప్రొఫెసర్ టి సీతా కుమారి పర్య వేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ క్లైమేట్ చేంజ్ ఆన్ పబ్లిక్ హెల్త్ ఇన్ ఇండియా–ఏ సోషియో లీగల్ స్టడీ' అనే అంశంపై పరి శోధన గ్రంథాన్ని వర్సిటీకి మంజువాణి సమర్పించడంతో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

ట్రాన్స్ఫరబుల్ స్కిల్స్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎం. ఉషా రాణి ఆధ్వర్యంలో డీన్, స్కూల్ ఆఫ్ సైన్సెస్, పి. సుజాతమ్మ అధ్యక్షతన శుక్రవారం డిపార్ట్మెంట్ అఫ్ కంప్యూటర్ సైన్స్, ఏపీఎస్ఎస్‌డిసి ల సంయుక్త ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు నిర్వహించే ' ట్రాన్స్ఫరబుల్ స్కిల్స్' కార్యశాల ను ప్రారం భించారు. ఇందులో భాగంగా మహేంద్ర ప్రైడ్ క్లాసు రూమ్ ప్రాజెక్ట్ నాంది ఫౌండేషన్ గ్రూప్ శిక్షకులు వై రజని కుమారి, ఆయేషా షేక్, ఎంసీఏ విద్యార్థులకు 18 అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి కంప్యూటర్ సైన్స్ అధ్యా పకులు, విద్యార్థులు హాజరయ్యారు.

భవన నిర్మాణ కార్మికుడికి ప్రమాద బీమా అందజేత

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: ఆరు నెలల క్రితం చోటుచేసుకున్న ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న భవన నిర్మాణ రంగ కార్మికుడు గంగాధర్‌కు ఎమ్మెస్ లైఫ్ స్టీల్ సంస్థ శుక్రవారం ప్రమాద బీమా అందజేసింది. తొట్టంబేడు మండలం శేషమ నాయుడుకండ్రిగ గ్రామానికి చెందిన గంగాధర్(55) 30 ఏళ్లుగా తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఆరు నెలల క్రితం శ్రీకాళహస్తి పట్టణంలోని వీఎంపల్లి సమీపంలో రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని ప్రమాదంలో గంగాధర్ కుడి కాలుకు తీవ్ర గాయమై మంచానికే పరి మితమయ్యాడు. దీంతో ఎమ్మెస్ లైఫ్ సంస్థ ప్రతినిధులు స్థానిక హిందుస్థాన్ స్టీల్ అండ్ సిమెంట్ డీలర్ అండ్ ప్రొప్రైటర్ షేక్ ఇలియాస్ బాబు సమక్షంలో గంగాధర్‌కు రూ.30 వేలు ప్రమాద బీమా చెక్కును అందించారు.

క్రైం కార్నర్

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-సోమల: నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటనరసింహులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు.. మండలంలోని నజంపేట సమీప అటవీ ప్రాంతంలో సోదాలు నిర్వహించామన్నారు. 1200లీటర్ల ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. అదేవిధంగా 35లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అదుపులో తీసుకున్నట్లు ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. స్థానిక ఈస్ట్ పోలీస్ స్టేషన్ లో శుక్రవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాలతో రోజువారి తనిఖీల్లో భాగంగా రేణిగుంట రోడ్డు ఫ్లైఓవర్ పోస్టల్ కాలనీ క్రాస్ వద్ద ఫుట్ పెట్రోలింగ్ చేపట్టామన్నారు. అక్కడ అనుమానంతో తిరుగుతున్న ఇద్దరు నిందితులను అదుపులో తీసుకొని విచారించిగా, వారి వద్ద 5 కేజీల గంజాయి లభించిందన్నారు. వెంటనే అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకుని విచారించగా సూళ్లూరుపేట తానేలి గ్రామానికి చెందిన సాయి కృష్ణ, ప్రస్తుతం గ్రాండ్ వరల్డ్ సమీపంలోని ఎస్ఎల్వీ నగర్ లో కాపురం ఉంటున్నాడు, చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం రాగిమోను పెంట గ్రామానికి చెందిన ముని చర్ల సాయి, ప్రస్తుతం తిరుపతి రూరల్ పంచాయతీలో కాపురం ఉంటున్నారు. వీరిద్దరూ కలిసి పాడేరు నుంచి ఈ గంజాయిని కొనుగోలు చేసి నగరానికి తెచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి తిరుపతి నగరం చుట్టుపక్కల ప్రాంతాలలో విక్రయిస్తున్నట్లు అంగీకరించారన్నారు. వీరి ఇరువురిపై ఎన్.డి.పి.ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఈస్ట్ సీఐ తెలిపారు.

పందెం రాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ ప్రాంతంలో కోడిపందేలు ఆడుతున్న 17 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ పి పరమేశ్వర రెడ్డి సూచనల మేరకు, స్పెషల్ ఇన్ఫోసిమెంట్ బ్యూరో ఏఎస్పి ఏ రాజేంద్ర ఆదేశాలతో ఇంటెలిజెన్స్ వింగ్, తిరుపతి , సెబ్ స్టేషన్ తిరుపతి రూరల్ డిటిఎఫ్ తిరుపతి సామూహికంగా తమకు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం దాడులు నిర్వహించారు. కుంట్రపాకం పంచాయితీ పరిధిలో 17 మంది వ్యక్తులు కోడిపందేలు ఆడుతు సెబ్ అధికారులకు చిక్కారు, వారి నుండి 5 కోళ్లు , రూ.32,960 నగదు, 15 మొబైల్స్ స్వాధీనం చేసుకుని, వారిని తిరుచానూరు పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి జిల్లా కోర్టుకు హాజరైన సుబ్రహ్మణ్యస్వామి

ఆంధ్రజ్యోతి కేసు ఫిబ్రవరికి వాయిదా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఆంధ్రజ్యోతి దినపత్రిక పై టీటీడీ వేసిన కేసును వాదించేందుకు బిజెపి మాజీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి శుక్రవారం తిరుపతి జిల్లా కోర్టుకు హాజరయ్యారు. కోర్టు విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేసింది. టీటీడీ వెబ్ సైట్ లో అన్యమత ప్రచారం చేస్తున్నారని గతంలో ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రచురించడంతో దీనిపై టీటీడీ కోర్టులో కేసు వేసింది. స్పందించిన ఎంపీ సుబ్రహ్మణ్యం స్వామి ఆంధ్రజ్యోతి దినపత్రికపై వందకోట్ల పరువు నష్టం దావా కేసు దాఖలు చేసిన విషయం విదితమే. కేసు విచారణలో భాగంగా కోర్టుకు హాజరై టీటీడీ జత చేసిన పత్రాలను సుబ్రహ్మణ్య స్వామి పరిశీలించారు. కానీ న్యాయవాదుల సమ్మె కారణంగా కేసు విచారణ ఫిబ్రవరి 5 తేదీకి వాయిదా పడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రిజిస్టర్ న్యాయవాది కానందున కేసులు వాదించేందుకు జడ్జి అంగీకరించలేదని, హై కోర్టు ద్వారా ప్రత్యేక ఉత్తర్వులు తీసుకు వచ్చానని, కేసులో వాదనలు వినిపించేందుకు వచ్చానని కానీ న్యాయవాదుల సమ్మె కారణంగా కేసు వాయిదా పడిందని తెలిపారు. టీటీడీ ప్రతిష్ట దెబ్బ తీసేందుకు అసత్య వార్తను ప్రచురించారు. దేవస్థానం అన్ని ఆధారాలు కోర్టుకు సమర్పించిందని తెలిపారు.

లారీ, బస్సుఢీ

ఇద్దరు మృతి

ప్రజాశక్తి -పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని కొత్తూరు గ్రామం వద్ద నేషనల్ హైవే పై శుక్రవారం ఉదయం లారీ, బస్సు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని గాయాలైన వారిని హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చత్తీస్‌ఘడ్ నుండి తిరుపతి వైపు వెళుతున్న గుప్తా ట్రావెల్స్ బస్సు వేలూరు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కంకర్ లోడ్ లారీ ఎదురెదురుగా ఢీకొనడతో బస్ డ్రైవర్ దినేష్ ప్రతాప్ సింగ్ (48) అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ రెండు వాహనాల మధ్య ఇరుక్కు పోవడంతో ఒక కాలు పూర్తిగా కట్ అయ్యింది. అతడిని క్రేన్ సహాయంతో బయటికి తీసి 108 ద్వారా నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స తీసుకుంటుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. లారీ డ్రైవర్ విల్లుపురానికి చెందిన ఇలగ వరణ్ (43) అని గుర్తించారు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ మాట నిలబెట్టుకొనే వ్యక్తి: డిప్యూటీ సీఎం



పెనుమూరు సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్, గంగాధరనెల్లూరు, వెదురుకుప్పం: ఇచ్చిన మాట నెలబెట్టుకొనే వ్యక్తిత్వం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శుక్రవారం గంగాధరనెల్లూరు, పెనుమూరు మండల కేంద్రాల్లో ఎంపీడీవో కార్యాలయంలో పెంచిన రూ.3వేల పింఛన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రామకుప్పం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పింఛన్‌లు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్సీ భరత్, జడ్పీ ఛైర్మన్ వాసు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్‌లను శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సభలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రహ్మణ్యం, జెడ్పిటిసి నితిన్ రెడ్డి, ఏఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, సర్పంచ్ మురళి, బైరెడ్డిపల్లి ఎంపీపీ రెడ్డప్ప, తహశీల్దార్ మురళి, ఎంపీడీవో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: చెప్పిన హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్‌రాజా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీలో పింఛన్ పంపిణీ కార్యక్రమం సర్పంచ్ ఉమాదేవి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో లబ్ధిదారులకు రూ.3వేల పెంచిన పింఛన్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పిటిసి సోమశేఖర్, సింగల్ బెడ్ అధ్యక్షులు దత్తరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సోమశేఖర్, ఉపాధ్యక్షులు సర్దార్, కోఆప్షన్ నెంబర్ ఫిరోజ్ అహ్మద్, సర్పంచ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని 19 సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన 7886మందికి వైఎస్సార్ పింఛన్ కానుకను లబ్ధిదారులకు అంజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటే గౌడ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

'ఎన్‌విఎస్ బాబు సేవలు చిరస్మరణీయం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏపీఎస్‌ఆర్టీసీ ఎంప్లాస్ యూనియన్ నాయకుడు ఎన్విఎస్ బాబు సేవలు చిరస్మరణీయమని ఆ యూనియన్ గౌర అధ్యక్షుడు, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కొనియాడారు. ఎన్విఎస్ బాబు ప్రథమ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్టీసీ కార్మికులకు బాబు అందించిన సేవలను కొనియాడారు. బాబు ప్రథమ వర్ధంతికి ఒక్కరోజు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఆయన కుమారుడికి కారుణ్య నియామక ఉత్తర్వు ఇవ్వడం హర్షణీయమన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజువర్ధన్ రెడ్డి, యూనియన్ నాయకులు పసుపులేటి శ్రీనివాసకుమార్, ఆవుల ప్రభాకర్, ఆచారి పాల్గొన్నారు.